RNI-TELTEL/2017/72695

11 జూలై 2023

# శుభ తెలంగాణ

మంగళవారం | మేడ్చల్

ఎడిటర్: ఎన్ సీ శేఖర్

సంపుటి : 6, సంచిక :126

వెల: 4 రూ/.

Website: www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

## ఐదువేలిచ్చి ఇంట్లో దూరే అవకాశమిచ్చారు

### వాలంటీర్ వ్యవస్థపై మరోసారి పవన్ కల్యాణ్ కామెంట్

అందరు వాలంటీర్ల గురించి మాట్లాడటం లేదని స్పష్టీకరణ

ఇన్ని వ్యవస్థలు ఉండగా వాలంటీర్ వ్యవస్థతో పనేమిటని నిలదీత

ప్రభుత్వం ఉద్దేశ్యం వేరే కావొచ్చు.. కానీ డేటా వేరే వారి చేతుల్లోకి వెళ్తే ఎలాగని ప్రశ్న

ఐదువేలిచ్చి వాలంటీర్లతో జగన్ ఊడిగం చేయిస్తున్నారని విమర్శ



వివరాలు 2లో..

# త్వరలోనే అసెంబ్లీ రద్దు

### జగదీశ్, గుత్తాలు కత్తులతో పొడుచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు: కోమటిరెడ్డి

- పీసీసీ చీఫ్ పదవి రానందుకు కొన్నిరోజులు బాధపడ్డాను: కోమటిరెడ్డి
- రేవంత్, భట్టితో కలిసి పని చేస్తున్నట్లు చెప్పిన ఎంపీ
- ప్రతి పార్టీలో గ్రూప్‌లు ఉంటాయన్న కోమటిరెడ్డి
- బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ కంటే ఎక్కువ గ్రూప్‌లు ఉన్నాయన్న ఎంపీ



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** :తెలంగాణలో మరో 45 రోజుల్లో అసెంబ్లీ రద్దు కాబోతుందన్నారు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఎమ్మెల్యేలు, మంత్రులు అంతా మాజీలు కాబోతున్నారని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల వద్ద నేషనల్ హైవే నిర్మాణ పనులను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కోమటిరెడ్డి గౌరెల్లి నుంచి కొత్త గూడెం వరకు 2 వేల కోట్లతో నేషనల్ హైవేను కేంద్రమంత్రితో మాట్లాడి మంజూరు చేయించానని చెప్పారు. జాతీయ రహదారులు ఎప్పుడు స్థానికి ఎంపీ అభ్యర్థన మేరకే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని..అది కూడా తెలియని కేటీఆర్ అమెరికాలో చదివానని చెబుతారని ఎద్దేవా చేశారు. ఇసుక మాఫియాలో, వైన్ మాఫియాలో,గల్లీల్లో తిరిగే గాదరి కిషోర్ కు ఢిల్లీ ఎక్కడుందో తెలుసా అని ప్రశ్నించారు.మంత్రి జగదీష్ రెడ్డి అక్రమంగా సంపాదించిన 3 వేల కోట్లతో శంషాబాద్ దగ్గర 80 ఎకరాల భూమి కొన్నారని ఆరోపించారు. అక్రమ సంపాదన లో గాదరి కిషోర్ , జగదీశ్ రెడ్డితో పోటీపడు తున్నారని అన్నారు. బెంజ్ కారులో తిరుగుతాడని కొందరు తనను విమర్శి స్తున్నారని..తాను 30 సంవత్సరాల క్రితం యూత్ కాంగ్రెస్ లో ఉన్నప్పుడే బెంజ్ కారు లో తిరిగానని చెప్పారు కోమటిరెడ్డి. కష్టపడి వ్యాపారాలు చేసి సంపాదించా.. కానీ స్కూటర్ మీద తిరిగిన జగదీష్ రెడ్డిలా అక్రమంగా వేల కోట్లు సంపాదించలేద న్నారు. అక్రమాలు ఆగాలన్నా.. తెలంగాణ లూటీ ఆగాలన్నా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఐటీ మినిష్టర్ అయ్యుండి కూడా కేటీఆర్ జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం లో ముఖ్య మంత్రిగా ఎవరున్నా మొదటి సంతకం 4 వేల రూపాయల పెన్షన్ పైనే చేస్తారని చెప్పారు. ఈ నెల 20 వ తేదీన కొల్లాపూర్ లో ప్రియాంక గాంధీ పాల్గొన బోయే సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించబోతున్నామని చెప్పారు. నాలుగు పార్టీలు మారిన సుఖేందర్ రెడ్డి 12 కార్లలో తిరుగుతున్నారని.. అంత ప్రాణ భయం దేనికని ప్రశ్నించారు.

### మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా కీలక ఆయుధ కొనుగోళ్లు



- జులై 14న ఫ్రాన్స్ జాతీయ దినోత్సవం
- ప్రత్యేక అతిథిగా ప్యారిస్ వెళుతున్న మోదీ
- ఫ్రాన్స్ తో ఆయుధ ఒప్పందం కుదిరే అవకాశం
- 26 రాఫెల్ విమానాలు, 4 స్కార్పియన్ జలాంతర్గాముల కొనుగోలుపై భారత్ ఆసక్తి

వివరాలు 2లో..

### ఉమ్మడి పౌర స్మృతి బిల్లును బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది

ఉమ్మడి పౌర స్మృతిపై కేసీఆర్ షాకింగ్ వ్యాఖ్యలు

- దేశంలో ఎన్నో సమస్యలున్నా బీజేపీ పట్టించుకోవడం లేదని విమర్శ
- ప్రజలను విభజించేందుకు యూసీసీతో కుట్ర చేస్తోందని ఆరోపణ

వివరాలు 2లో..



## మాకు అపారమైన శక్తి ఉంది.. కానీ

### మణిపూర్ అల్లర్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



- మణిపూర్ లో ఇటీవల తీవ్ర హింస
- 150 మందికి పైగా మృతి
- జోక్యం చేసుకోవాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు
- శాంతిభద్రతల విషయం రాష్ట్ర ప్రభుత్వాలదేనన్న సుప్రీంకోర్టు

వివరాలు 2లో..

### ప్రతిపక్షాలు అధ్యక్షులను మార్చినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

తెలంగాణకు రావాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదని ఆగ్రహం

దక్షిణాదిపై బీజేపీది చిన్నచూపు అని ఆరోపణ

కాంగ్రెస్ కర్ణాటకలో రూ.4వేల పెన్షన్ హామీని అమలు చేయాలని సూచన



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కొన్ని పార్టీలు అధ్యక్షుల్ని మార్చినా , ఔట్ డేటెడ్ లీడర్లకు పదవులు కట్టబెట్టినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని మంత్రి హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్

వివరాలు 2లో..

## డిజైన్ లోపాలుంటే జలసంఘమే బాధ్యత వహించాలి

- పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జలసంఘం కీలక సమావేశం...
- ఇప్పటికీ పూర్తి కాని పోలవరం ప్రాజెక్టు
- డయాఫ్రం వాల్ పై ఈ ఏడాది జనవరిలో నివేదిక ఇచ్చిన ఎన్ హెచ్ పీసీ
- డయాఫ్రం వాల్ దెబ్బతినడంపై లోతుగా చర్చించిన జలసంఘం
- నిర్మాణ లోపాలపై రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్న జలశక్తి శాఖ

వివరాలు 2లో..



## ప్రజలతో సంబంధం లేనివారు పార్టీలెలా నడుపుతారు

### రాజకీయాలపై జస్టిస్ ఎన్వీ రమణ కీలక వ్యాఖ్యలు!



రాజకీయాల్లో వికృత ఘటనలు చూస్తున్నామన్న జస్టిస్ రమణ

సోషల్ మీడియాలో స్త్రీలను అసభ్యంగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చే వరకు తెలుగువారు విశ్రమించకూడదని పిలుపు

వివరాలు 2లో..

## గతేడాది ఇచ్చిన వాగ్దానం మరిచారు

### భవిష్యవాణిలో స్వర్ణలత

- ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయి.. జోగిని స్వర్ణలత భవిష్యవాణి
- వెన్నంటి ఉంటూ తన భక్తులను కాపాడుకుంటానని చెప్పిన జోగిని
- భవిష్యవాణి వినేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకల్లో రంగం కార్యక్రమం



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగుతున్నాయి. లష్కర్ బోనాల్లో కీలక ఘట్టమైన రంగం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా జోగిని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. "నాకు నిర్వహించిన పూజలను సంతోషంగా అందుకున్నాను. కానీ.. నాకు గతేడాది ఇచ్చిన వాగ్దానం మరిచారు.. ఎందుకు..? మీకు కావాల్సినంత బలం ఇస్తాను. మీ వెంటనే

వివరాలు 2లో..

## ఆహారం కోసం ప్రజలు ఇబ్బంది.. విలాసాలకు కిమ్ లక్షలు ఖర్చు

కరోనా తర్వాత ఎరువులు, ధాన్యం దిగుమతి నిలిపివేత

లగ్జరీ జీవితానికి మాత్రం కిమ్ జాంగ్ పెద్ద మొత్తంలో ఖర్చు

ఖరీదైన మద్యం, సిగరెట్లు, ఇంపోర్టెడ్ మాంసం దిగుమతి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ స్టయిలే వేరు. ఎటువంటి పరిస్థితులలోనూ తన లగ్జరీ జీవితాన్ని మా త్రం ఆయన వదులుకోరు. ప్రస్తుతం దేశం ఆహార సంక్షోభంతో కొట్టుమి ట్టాడుతోంది. అయినా కిమ్ మాత్రం తన లగ్జరీ జీవితానికి ఏమాత్రం లోటురానీయడం లేదు. ఖరీదైన మద్యం, సిగరెట్లు, ఇంపోర్టెడ్ మాంసం రుచిని

వివరాలు 2లో..

## పోలవరం కట్టేదీ మేమే.. అమరావతి నిర్మించేదీ మేమే..

ప్రజల కోసం ఏమైనా చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్

అవసరమైతే సీతక్కను సీఎం చేస్తామన్న టీపీసీసీ చీఫ్

ఎన్నికలకు ముందు సీఎం అభ్యర్థిని ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్‌కు లేదని స్పష్టీకరణ



వివరాలు 2లో..

# ఉమ్మడి పౌర స్మృతి బిల్లును బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది

**హైదరాబాద్** :ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) బిల్లును బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సయిఫుల్లా రెహ్మానీ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్, తదితరులు ప్రగతి భవన్ లో కేసీఆర్ ను కలిసి, యూసీసీని వ్యతిరేకించాలని కోరారు. ఈ బిల్లును తాము అంగీకరించమని వారికి హామీ ఇచ్చిన కేసీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. రెచ్చగొడుతూ పబ్బం గడిపేందుకే యూసీసీని తీసుకు వస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలను విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని, దురుద్దేశ్యంతోనే దీనిని తీసుకువస్తోందన్నారు. విభిన్న ప్రాంతాలు, జాతులు, మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతులు కలిగి.. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచిందని, కానీ ఈ ఐక్యతను కేంద్రం చీల్చే కుట్ర చేస్తోందన్నారు. అందుకే తాము దీనిని వ్యతిరేకిస్తున్నామన్నారు. యూసీసీ బిల్లుతో ప్రత్యేక సంస్కృతి కలిగిన గిరిజనులు, వివిధ మతాలు, జాతులు, ప్రాంతాలతో పాటు హిందూ మతాన్ని ఆచరించే ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. దేశ ప్రజల అస్థిత్వానికి, తరతరాల సంప్రదాయ సాంస్కృతిక ఆచార వ్యవహారాలకు ఇది గొడ్డలిపెట్టుగా మారుతుందన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

# ప్రతిపక్షాలు అధ్యక్షులను మార్చినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

- మొదటి పేజి తరువాయి
ఖాయమన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. దక్షిణాదిపై బీజేపీ సర్కార్ ది చిన్నచూపు అని, దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ ఏమైనా ఇచ్చిందా అంటే అది కేవలం శుష్కప్రియాలు, శూన్యహస్తాలు అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.4వేల పెన్షన్ హామీని ముందుగా కర్ణాటకలో అమలు చేయాలని సూచించారు. పటాన్‌చెరులో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్, ఫ్రీడమ్ పార్కులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణకు బీజేపీ, కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు.
కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలలో రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మీ, కేసీఆర్ కిట్స్ వంటి పథకాలు ఉన్నాయా? అని నిలదీశారు.
ఆ పార్టీలలో ప్రజలు తిరస్కరించిన లీడర్లు, స్క్రాప్ లీడర్లు చేరితే పోయేదేమీలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని ట్రిక్కులు చేసినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరన్నారు. బీఆర్ఎస్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు.

# పోలవరం కట్టేదీ మేమే.. అమరావతి నిర్మించేదీ మేమే..

**హైదరాబాద్** :ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సభల్లో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవం ప్రాజెక్టు, రాజధాని అమరావతి కట్టేది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. ఆ రెండింటినీ పూర్తిచేయడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి ఎన్నారైలు ఆసక్తికర ప్రశ్నలు సంధించారు.
దళితులు, ఆదివాసీలను ముఖ్యమంత్రిని కానివ్వరా? అన్న ప్రశ్నకు రేవంత్ స్పందిస్తూ.. ఎన్నికలకు ముందు సీఎం అభ్యర్థిని ప్రకటించడం కాంగ్రెస్‌లో లేదన్నారు. అవసరమైతే సీతక్కను పార్టీ ముఖ్యమంత్రిని కూడా చేస్తుందన్నారు. ప్రజల కోసం తాను ఏమైనా చేయాలని అనుకుంటున్నానని, వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. పార్టీని, తనను వేరు చేసి చూడొద్దని, తెలంగాణలో కాంగ్రెస్సే రేవంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు.

# ఐదువేలిచ్చి ఇంట్లో దూరే అవకాశమిచ్చారు

వాలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరోసారి విమర్శలు గుప్పించారు. అయితే తాను అందరు వాలంటీర్లను అనడం లేదని స్పష్టతనిచ్చారు. 30 వేల మంది మహిళలు మిస్ అయ్యారంటూ నిన్న పవన్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ ముప్పేట దాడి చేసింది. అయినప్పటికీ ఏలూరు కార్యకర్తలు, వీర మహిళల సమావేశంలో పవన్ వాలంటీర్ వ్యవస్థపై మాట్లాడుతూ... ప్రజలను అదుపు చేయడానికే ఈ వ్యవస్థ అన్నారు. కొన్నిచోట్ల ప్రజలను బెదిరిస్తున్నారన్నారు.
వాలంటీర్ వ్యవస్థ సేకరించిన డేటా ఎక్కడికో వెళ్తోందన్నారు. పంచాయతీరాజ్ సహా ఇన్ని వ్యవస్థలు ఉండగా వాలంటీర్ వ్యవస్థతో పనేమిటని ప్రశ్నించారు. అయితే తాను అందరు వాలంటీర్ల గురించి మాట్లాడటం లేదని, వారి పొట్ట కొట్టడం తన ఉద్దేశ్యం కాదన్నారు. వంద తాజా పండ్లలో ఒక్కటి కుళ్లినా మిగతావి కుళ్లిపోతాయన్నారు. పది మంది ఇంటింటికి తిరగడం ఏమిటన్నారు. వారికి రూ.5 వేలు ఇచ్చి ఇంట్లో దూరే అవకాశమిచ్చారని ఆరోపించారు. యువత సామర్థ్యాన్ని జగన్ గుర్తించడం లేదని, రూ.5 వేలకు వారితో ఊడిగం చేయిస్తున్నారన్నారు. నిరుద్యోగం పెరిగితేనే డిగ్రీ చదివి రూ.5 వేలకు పని చేస్తారన్నారు. శ్రమ దోపిడీ చేసే జగన్ క్లాస్ వార్ గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మీ డేటా అంతా వాళ్లకు తెలుసునని, ఎవరు ఎక్కడకు వెళ్తున్నారో అంతా తెలుస్తుందన్నారు. ఈ సమాచారం వేరే వాళ్ల చేతుల్లోకి వెళ్తే ఎలా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్దేశ్యం వేరే కావొచ్చు..కానీ సెన్సిటివ్ సమాచారం బయటకు పొక్కితే సమస్య అన్నారు.
వాలంటీర్ వ్యవస్థను చాలా జాగ్రత్తగా గమనించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి పార్టీ వారు వాలంటీర్ వ్యవస్థపై కన్నేసి ఉంచాలన్నారు. వారి పని వారు చేస్తే ఎలాంటి ఇబ్బంది లేదని, వైసీపీకి మాత్రమే పని చేస్తామంటే మాత్రం గట్టిగా అడగాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డలు ఉన్న కుటుంబాలు ఈ వ్యవస్థ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసరంగా మీ డేటా వారికి ఇవ్వవద్దని సూచించారు. ఒంటరి మహిళలు, వితంతువులు జాగ్రత్తగా ఉన్నారా? అని ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. మహిళల మిస్సింగ్ పై కేంద్ర సంస్థలు అధ్యయనం చేస్తున్నాయన్నారు. బియ్యం పంపిణీ తర్వాత ఉచిత బియ్యం వ్యాన్లు ఎక్కడకు వెళు _న్నాయని ప్రశ్నించారు.

# గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యల పరిష్కారం లో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు...

## సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్...



గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్ అన్నారు. సోమవారం పెద్దవంగర మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నాలుగో రోజు దీక్షల దగ్గరికి హాజరై, జరిగే నిరాహార దీక్షలకు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా బొల్లం అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ యాకుబ్ లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న వారి జీవితాల్లో ఏమాత్రం మార్పు లేదని, వెట్టి చాకిరి మాత్రం తప్పడం లేదని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల కార్మికులను విస్మరిస్తుందని విమర్శించారు. పంచాయతీ కార్మికులకు కనీసం పదోన్నతులు ఇచ్చిన దాఖలాలు కూడా లేవని, జీవో నెంబర్ 51 తీసుకువచ్చి మల్టీపర్పస్ ఉద్యోగం పెట్టి చాకిరి చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జీవో నెంబర్ 51 నీ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సీనియార్టీని బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ కూడా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో స్థానిక మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జోక్యం చేసుకొని రాష్ట్రంలో ఉన్నటువంటి గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల అందరిని కలుపుకొని ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని, వారి పోరాటానికి ఎల్లవేళలా కార్మిక సంఘాలు అండదండలుగా ఉంటాయని, వారి సమస్యలు పరిష్కారాలు అయ్యేంతవరకు గ్రామపంచాయతీ కార్మికులు చేసే ప్రతి పోరాటంలో కలిసి వస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జమ్ముల శ్రీను, తిమ్మిడి రవి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రాపోలు వీరయ్య, తడకమల్ల ఐలయ్య, సిఐటియు మండల కన్వీనర్ కసిర బోయిన కుమారస్వామి, సిబ్బంది రామస్వామి, శ్రీకాంత్, భాష, ఎల్లమ్మ, యాకమ్మ, పద్మ, ఉప్పలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 12,న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్,AISF

**ఫీజులు నియంత్ర చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**
**ప్రభుత్వ పాఠశాల కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి**
AISF,



ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు స్థానిక తొర్రూర్ లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 12 న బంద్ ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కిన్నెరా సోయలు మాట్లాడుతూ
రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 17,5 00 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపించడం లేదని విమర్శించారు కార్పొరేట్ విద్యాసంస్థల మీదున్న ప్రేమ ప్రభుత్వానికి ప్రభుత్వ విద్యాసంస్థల మీద లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రభుత్వం లాలూచీ విధానానికి నిదర్శనం అన్నారు ఎవరికివారు ఇష్టానుసారంగా వారికి నచ్చిన విధంగా ఫీజులు నిర్ణయించుకొని విద్యార్థుల నుండి మొక్కుపిండి వసూలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు పాఠశాలలో వ్యాపార కేంద్రాలుగా మార్చుకొని స్టేషనరీ సైతం తమ పాఠశాలలోనే విక్రయిస్తూ విద్యావ్యవస్థకే మచ్చ తెచ్చే విధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల తీరు కనిపిస్తుందన్నారు డొనేషన్ల పేరుతో పాటు ఫీజులు అధికంగా వసూలు చేయడంతో పాటు యూనిఫాంలో పుస్తకాలు తమ వద్ద కొనుగోలు చేయాలంటూ తల్లితండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని వారు ఆరోపించారు. 12న జరిగే బందుకు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థి తల్లిదండ్రులు బంద్ కు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సందీప్ ,సాయికిరణ్,లక్ష్మణ్,సుమంత్,వీరేందర్ రవి సాయి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆహారం కోసం ప్రజలు ఇబ్బంది.. విలాసాలకు కిమ్ లక్షలు ఖర్చు

- మొదటి పేజి తరువాయి
ఆయన ఆస్వాదిస్తున్నాడట. ఈ మేరకు యూకే రక్షణ రంగ నిపుణుడు ఒకరు డైలీ స్టార్ పత్రికకు వెల్లడించారు. కిమ్ జాంగ్ 7 వేల డాలర్లు విలువ చేసే హెన్నెస్సీ బ్రాందీని తాగుతాడని పేర్కొన్నారు. అంటే మన కరెన్సీలో రూ.5 లక్షలకు పైమాటే!
కొన్ని సంవత్సరాల క్రితం చైనీస్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ తెలిపిన ట్రేడ్ డేటా ప్రకారం.. విలాసవంతమైన మద్యం బ్రాండ్ల దిగుమతికే కిమ్ ప్రతి ఏటా 30 మిలియన్ డాలర్ల మేర వెచ్చిస్తారు. తనకు ఇష్టమైన బ్రెజిలియన్ కాఫీ కోసం ప్రతి సంవత్సరం 9.6 లక్షల డాలర్లను వెచ్చిస్తున్నారు. ఆయన తాగే సిగరెట్లు ప్రత్యేకమైన బంగారపు రేకుతో చుట్టి ఉంటాయని చెబుతున్నారు. మద్యంతో పాటు కిమ్ ఇటలీలోని పర్మా ప్రాంతంలో తయారు చేసే పర్మా హెూమ్, స్విస్ చీజ్ నూ దిగుమతి చేసుకుంటారు. కిమ్ వద్ద గతంలో వంట చేసిన చెఫ్ ఒకరు యూకే టాబ్లాయిడ్ తో మాట్లాడుతూ... కిమ్, అతని తండ్రి కలిసి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన గొడ్డు మాంసం కోబ్ స్టీక్స్, క్రిస్టల్ షాంపైన్ తో భోజనం చేసేవారని చెప్పారు. 1997లో కిమ్ పిజ్జాలు చేసేందుకు ఇటలీ నుండి ఖరీదైన చెఫ్ ను రప్పించాడు. యూకే మెట్రో రిపోర్ట్ ప్రకారం... 2014లో కిమ్ లో లైంగిక సామర్థ్యం పెరిగేందుకు ఖరీదైన స్నేక్ వైన్ తాగేవాడు. అమెరికా నుండి మార్ల్ బోరో సిగరెట్లు, నిద్రలేమికి చికిత్స చేసే జిల్పిడెమ్ వంటి వాటిని దిగుమతి చేసుకునేవారు. కరోనా తర్వాత ఉత్తర కొరియాలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. చైనా నుండి ఎరువులు, ఆహార ఉత్పత్తికి అవసరమైన పరికరాలు, ధాన్యాల దిగుమతిని ఉత్తర కొరియా నిలిపివేసింది. దీంతో ఇక్కడ పంట దిగుబడి తగ్గి, ఆహార సంక్షోభం తలెత్తింది. కానీ కిమ్ విలాసాలు మాత్రం తగ్గడం లేదు. ఉత్తర కొరియాలో 2.6 కోట్ల జనాభా ఉంది.

# ప్రజలతో సంబంధం లేనివారు పార్టీలెలా నడుపుతారు

రాజకీయాలపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో జరుగుతున్న 23వ తానా మహాసభల్లో జస్టిస్ రమణ ప్రసంగించారు. రాజకీయాల్లో వికృత ఘటనలు చూస్తున్నామని, పార్టీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారని ఆయన అన్నారు.
ప్రజలతో సంబంధం లేనివారు పార్టీలెలా నడుపుతారని జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించారు. రాజకీయాల్లో ప్రమాణాలు పూర్తిగా పడిపోతున్నాయని అన్నారు. సోషల్ మీడియాలో స్త్రీలను అసభ్యంగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."దుష్ప్రచారమే ఎన్నికల వ్యూహంగా మారింది. మేనిఫెస్టో గురించి మాట్లాడే అవకాశమే లేకుండా పోయింది. సామాజిక మాధ్యమాల ద్వారా పక్కదోవ పట్టిస్తున్నారు. ప్రలోభ అంశాలకు ప్రాధాన్యత పెంచి ఓట్లు దండుకుంటున్నారు" అని జస్టిస్ రమణ విమర్శలు చేశారు.
ప్రజాస్వామ్యం పరాజయం పాలవుతోందని జస్టిస్ ఎన్వీ రమణ ఆందోళన వ్యక్తం చేశారు. యువత, మేధావులు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లోకి నీతిమంతులు రాకపోతే.. నీతిలేని వారే రాజ్యమేలుతారన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేవరకు తెలుగువారు విశ్రమించకూడదని పిలుపునిచ్చారు.

# మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా కీలక ఆయుధ కొనుగోళ్లు

ఫ్రాన్స్ జాతీయ దినోత్సవం (జులై 14) సందర్భంగా ప్రత్యేక అతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్యారిస్ వెళుతున్నారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో, భారత్-ఫ్రాన్స్ దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం మరింత విస్తరించనుంది.
ఇప్పటికే ఫ్రాన్స్ నుంచి శత్రుభీకర రాఫెల్ యుద్ధ విమానాలను అందుకున్న భారత్... మోదీ పర్యటనను మరిన్ని ఆయుధ కొనుగోళ్లకు అవకాశంగా మలుచుకోనుంది. మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా 26 రాఫెల్ యుద్ధ విమానాలు, 3 స్కార్పియన్ క్లాస్ జలాంతర్గాముల కొనుగోలుకు మేక్రాన్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ముందు భారత నేవీ పలు ప్రతిపాదనలు ఉంచింది. ఫ్రాన్స్ తో ఒప్పందం కుదిరితే, 22 సింగిల్ సీటర్ రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలతో పాటు 4 ట్రైనర్ ఎయిర్ క్రాఫ్టులు కూడా భారత్ కు అందజేస్తారు. హిందూ మహాసముద్రంలో, అరేబియా సముద్రంలో భద్రతా సవాళ్లు పెరిగిపోతున్న నేపథ్యంలో, భారత నేవీ ఆయుధాల కొరతను ఎదుర్కొంటోంది. రాఫెల్ యుద్ధ విమానాలు, స్కార్పియన్ సబ్ మెరైన్లు అత్యవసరంగా కావాలని నేవీ కోరుకుంటోంది. ఒకవేళ ఫ్రాన్స్ గనుక రాఫెల్ మెరైన్ ఎయిర్ క్రాఫ్ట్ లను అందిస్తే, ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక నౌకల నుంచి కార్యకలాపాలు సాగించనున్నాయి.

# మాకు అపారమైన శక్తి ఉంది.. కానీ..:

మణిపూర్ లో నెలకొన్న హింసాత్మక ఘటనల పట్ల దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రాల్లో శాంతిభద్రతలను సుప్రీంకోర్టు నిర్వహించలేదని, అది రాష్ట్ర ప్రభుత్వాల పని అని స్పష్టం చేసింది. మణిపూర్ లో రిజర్వేషన్లకు సంబంధించి కుకీ, మీయిటీ సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో 150 మందికి పైగా బలయ్యారు. తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో, మణిపూర్ లో అరాచక పరిస్థితులను అదుపులోకి తీసుకురావాలని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కుకీ తెగకు చెందిన పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ హింసను బీజేపీ భాగస్వామ్య రాష్ట్ర ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని కుకీల తరఫు న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్ ద్విసభ్య ధర్మాసనానికి విన్నవించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన ధర్మాసనం పిటిషనర్ల వాదనలు విన్న అనంతరం, తమ అభిప్రాయాలు వెల్లడించింది. మణిపూర్ లో మరింత హింసను ఎగదోసే ఎలాంటి నిర్ణయాలకు సుప్రీంకోర్టును వేదికగా చేయలేమని సీజేఐ పేర్కొన్నారు. "సుప్రీంకోర్టు ఏం చేయగలదన్నదానిపై మాకు స్పష్టత ఉంది. ఏ రాష్ట్రంలోనైనా శాంతి భద్రతలు అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలే చూసుకుంటాయి. ఇది మానవతా సంక్షోభమే. సుప్రీంకోర్టు శక్తి కూడా అపారమైనదే... కానీ ఇలాంటి విషయాల్లో మేం జోక్యం చేసుకోలేం. ఆ విషయంపై మేం పూర్తి స్పృహతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు.

# డిజైన్ లోపాలుంటే జలసంఘమే బాధ్యత వహించాలి

ఇంకా పూర్తి కాని పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జలసంఘం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, పీపీఏ సభ్యులు హాజరయ్యారు. పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయమై జలసంఘం లోతుగా చర్చించింది. డయాఫ్రం వాల్ నాలుగు ప్రదేశాల్లో దెబ్బతిన్నట్టు వచ్చిన నివేదికపై చర్చించింది. డయాఫ్రం వాల్ నిర్మాణ లోపాల బాధ్యత రాష్ట్రానిదేనని జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ఒకవేళ డిజైన్లలో లోపాలు ఉంటే మాత్రం జలసంఘమే బాధ్యత వహించాలని కేంద్రం పేర్కొంది. డయాఫ్రం వాల్ పై ఈ ఏడాది ఆరంభంలో ఎన్ హెచ్ పీసీ నివేదిక ఇచ్చింది. డయాఫ్రం వాల్ ను 8 జాయింట్లుగా కొత్తగా నిర్మించాలని ఎన్ హెచ్ పీసీ తన నివేదికలో సిఫారసు చేసింది. ఈ నివేదిక మేరకు నిర్మాణాలు చేపట్టేందుకు అధ్యయనం చేయాలని కేంద్రం నేటి సమావేశంలో సూచించింది. పోలవరం ప్రాజెక్టు పనులపై నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు వారం గడువు విధించింది. ఒకవేళ, చేపట్టలేని పనులేవైనా ఉంటే అందుకు తగిన సాంకేతిక కారణాలను చూపించాలని జలసంఘం పేర్కొంది. రాష్ట్రం ఇచ్చిన నివేదికపై జలసంఘం అధ్యయనం చేస్తుందని కేంద్రం పేర్కొంది. రాష్ట్ర నివేదిక వచ్చిన వారం లోగా మరో నివేదిక ఇవ్వాలని కేంద్రం జలసంఘాన్ని ఆదేశించింది. కాగా, గైడ్ బండ్ విషయంలో ఇచ్చిన నివేదికపై మరికొంత సమాచారం కావాలని జలశక్తి శాఖ కోరింది. గైడ్ బండ్ పై పూర్తి నివేదిక వచ్చాకే తదుపరి నిర్ణయం ఉంటుందని అధికారులు చెప్పారు. డయాఫ్రం వాల్, గైడ్ బండ్ పై మరో రెండు వారాల తర్వాత సమావేశం కావాలని నిర్ణయించారు.

# మీ కష్టాలు, బాధలు, జీవనస్థితిగతులు నాకు తెలుసు...

- జర్నలిస్టులను కంటికి రెప్పలా కాపాడుకుంటా...
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి...



**ఎల్బీనగర్, శుభ తెలంగాణ :**సమాజంలో ఉన్న అసమానతలను రుగ్మతలను రూపుమాపుతూ సమాజ ఉద్ధరణకు పాటుపడుతున్న జర్నలిస్టులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టు జేఏసీ ఆధ్వర్యంలో ఛైర్మెన్ వి ఎన్ రాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన మాట ౹౦ ముచ్చట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. సమాజంలో మార్పుకు మీవంతు ప్రయత్నాలు చేస్తున్నారు కానీ మీ బ్రతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులు గత కొంతకాలంగా నివాస స్థలాలు కేటాయించాలని తమను కోరుతున్నారని తెలిపారు. జర్నలిస్టుల నివాస స్థలాల కోసం తన వంతు ప్రయత్నంగా జిల్లా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టానని అన్నారు. ప్రయత్నంలో భాగంగా కొంతమేర సక్సెస్ సాధించడం జరిగిందని, పూర్తిస్థాయిలో అందరి జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇప్పించడానికి తాను నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. మీ కష్టాలు, బాధలు, జీవనస్థితిగతులు నాకు తెలుసన్నారు. మీ జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి దొరికిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీకు న్యాయం జరిగే వరకూ నావంతు కృషి చేస్తానన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి పరిధిలో ఉండడంతో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అందుకే జిల్లా మంత్రి సహకారంతో పక్క నియోజకవర్గమైన ఇబ్రహీంపట్నం పరిధిలో ఉన్న స్థలాలను ఎమ్మెల్యే సహకారంతో పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయత్నలోపం లేకుండా మీకోసం నేను గత మూడు నెలలుగా ఎంతో శ్రమిస్తున్నట్లు తెలిపారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుందని తాను ఆశిస్తున్నానని మీరు కూడా తనకు అండగా ఉండాలని కోరారు. ఫలితం అనుభవించే వరకు మీ జేఏసీ నిరంతరం ఇలాగే క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. రెండు మూడు రోజులలో జిల్లా మంత్రి సబితఇంద్రారెడ్డి తో తేనేటి విందు కార్యక్రమం ఏర్పాటు చేసుకొని మన సమస్యను ఆమె దృష్టిలో పెట్టి పరిష్కారం కోసం కృషి చేసుకుందామని సూచించారు. అనంతరం జర్నలిస్టులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. జర్నలిస్టులు వారి కుటుంభసభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జనసేన పార్టీ అధినేత ను వ్యక్తిగతంగా దూషించినందుకు పోలీస్ స్టేషన్లో కేసు ఫిర్యాదు


పాలకుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ వెల్తూరి నగేష్



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి వ్యక్తిగత జీవితంకు సంబంధించి, ఆయన కుటుంబ సభ్యుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శ్రీ నేమూరీ శంకర్ గౌడ్ గారి ఆదేశాల మేరకు సోమవారం అనగా తేదీ 10/07/ 2023 రోజున పాలకుర్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వెల్తూరి నగేష్ గారి ఆధ్వర్యంలో స్థానిక తొర్రూరు పట్టణ పోలీస్ స్టేషన్ %ూ×% గారికి పిర్యాదు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసైనికులు గట్ల సతీష్ ,జలకం శివ కుమార్, కొండ్లె ఉమేష్, జక్కుల శంకర్ ప్రసాద్ , చింతల మధుకర్ తదితరులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ లో చేరిన భవన నిర్మాణ కార్మికులు...

- గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేపి వివేకానంద్...



**కుత్బుల్లాపూర్ శుభ తెలంగాణ :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం 129 డివిజన్ నెహ్రూనగర్ కు చెందిన తెలంగాణ భవన నిర్మాణ కార్మిక యూనియన్ శ్రీ చైతన్య సాగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే కేపి వివేకానంద్ సమక్షంలో చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. చేతివృత్తుల వారికి లక్ష రూపాయలు అందించి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ పథకంలో భాగంగా సగర సంఘానికి కూడా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు మారయ్య, సిద్ధిక్, ఫెరోజ్, గండయ్య, దశరత్, అఖిల్, కిరణ్ సాగర్, విట్టల్, అలీ, కృష్ణ, సత్యనారాయణ, కృష్ణ హరి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల 5వ రోజు సమ్మెలో పాల్గొన్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక జులై 11. పనుమటి సైదులు అడ్డగుడూర్ మండల రిపోర్టర్.** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగుడూర్ మండలం

ఎవరినో బిచ్చం ఎత్తుకోవడానికి పోరాటం చేసి తెలంగాణ తెచ్చుకోలేదు పోరాటంతోనే హక్కులు సాధించుకోవాలి అని గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సంఘీభావంలో పేర్కొన్న భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి.


తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్మిక జేఏసీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండల కేంద్రంలో 5వ రోజు కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కరోనా కష్ట సమయంలో అందరూ ఇళ్ళల్లో ఉంటే కేవలం గ్రామ పంచాయతీ కార్మిక సోదరులు ప్రాణాలకు తెగించి విధినిర్వహణ చేయడం జరిగిందని, అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికులు దేవుల్లు అని పొగిడి సన్మానాలు పాదాబి వందనాలు చేస్తే ఇప్పుడు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రోడ్డు ఎక్కితే వారిని పట్టించుకోకుండా వాస్తు పేరుతో వేల కోట్ల రూపాయలతో సచివాలయ నిర్మాణం చేపట్టడం విచిత్రం అన్నారు.

శ్రీకాంత చారి లాంటి అమరుల త్యాగం వృధా కాకూడదని ఆంధ్ర ప్రాంతంలో తమ పార్టీ ఊడ్చుకుపోతుందని తెలిసి కూడా సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేస్తే బంగారు తెలంగాణ కోసం కళలు గన్న ఉద్యమకారుల ఆశలను అడియాశలు చేస్తూ కేవలం సీఎం కెసిఆర్ కుటుంబం మాత్రమే బంగారం అయిందని అంతే తప్ప ఏ ఒక్క ఉద్యోగస్తుడు సరైన తేదీకి జీతాలు ఇవ్వలేని దుస్తితి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వందని చాలీ చాలని జీతాలతో, దుమ్ము ధూళి దుర్గందాలతో జీవన పోరాటం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెను లెక్క చేయకుండా సంబంధిత మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విదేశాలలో తిరగడం వారి విజ్ఞత అన్నారు.

వచ్చే నాలుగు ఐదు నెలల్లో ప్రభుత్వంలోకి రానున్నది తమ కాంగ్రెస్ పార్టీయే అని, అధికారంలోకి రాగానే ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్న తొలి సంతకం అర్హులకు రూ. 4000 పెన్షన్ ఫైల్ పై సంతకం చేయడం జరుగుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాలని లేని యెడల పోరాటాలకు కూడా వెనుకాడమని హెచ్చరించారు.

గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించుటకు కృషి చేస్తానని, అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడం లేదా లేఖ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మరియు కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టుల ఫోరం ఆత్మగౌరవ సభ కర పత్రం విడుదల



**జోగులాంబ గద్వాల, జూలై 10 (శుభతెలంగాణ):**మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఉన్న దళిత జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి హాజరవుతారని తెలిపారు. తాను జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జులై 29న జిల్లా కేంద్రంలో అరుంధతి భవనంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ పిలుపునిచ్చారు. ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ మంజూరు చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, దళిత బందు ఇవ్వాలని, ప్రకటనలు ఇవ్వాలని, నామినేటెడ్ పదవులను ఇవ్వాలని, ఎలాంటి దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగత్ ప్రకాష్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము దామోదర్, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు కొంగళ్ళ కృష్ణయ్య, దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడు నరెందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన నాగారం పురపాలక సంఘం....



**నాగారం, జులై10,(శుభ తెలంగాణ)**నాగారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో సీపీఆర్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగారం పురపాలక సంఘ పరిధి లోని స్టార్ ఫంక్షన్ హాల్ లో సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసిసిటేషన్) ఈవెంట్‌లో చంద్రారెడ్డి మాట్లాడుతూ గుండెపోటు మరణాల సంఖ్య పెరిగిన దృష్ట్యా ప్రజలందరికీ సీపీఆర్‌పైన అవగాహన కల్పించాలని ఈవెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీఆర్‌పై అందరికీ అవగాహన ఉండాలన్నారు. తినే ఆహారం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే ఆహారం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిజ్జా శ్రీనివాస్ గౌడ్, నగేష్ గౌడ్, పంగ హరిబాబు, కోఆప్షన్ సభ్యులు షఫీ, అశోక్, కార్యాలయ మేనేజర్ చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది, కాలనీల ప్రజలు తదితరు పాల్గొన్నారు.

# సన్ సీడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం....



**దమ్మాయిగూడ ,జూలై 10(శుభ తెలంగాణ)** కుషాయిగూడ నాగార్జున నగర్ కాలనీలోని ' సన్ సీడ్ సూపర్ స్పెషాలిటీ న హాస్పిటల్ ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ కార్మికులు,సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్ సీడ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్మికులకు సిబ్బందికి పరీక్షలు చేయడం సంతోషమైన విషయమన్నారు. దమ్మాయిగూడ ప్రజలు సన్ సీడ్ హాస్పిటల్ సేవలు ఉయోగించుకోవాలని తెలియజేసారు. అనంతరం సన్ సీడ్ హాస్పిటల్ ఛైర్మన్ డా. అన్వేష్ మాట్లాడుతూ మా హాస్పిటల్లో అన్నిరకాల స్పెషాలిటీ వైద్య సేవలు 24 గంటలు ఉంటాయని తెలిపారు. కార్మికులకు, పేదవారికి 30 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. ఈ ఈ వైద్య శిబిరంలో మున్సిపల్ కమిషనర్ స్వామి,మేనేజర్ వెంకటేశం,హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. బాణు బందర్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీత్ల పండుగ శుభాకాంక్షలు



**శుభ తెలంగాణ :**డోర్నకల్ నియోజకవర్గం గిరిజనులకు సీత్ల పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న డోర్నకల్ బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ నంద నాయక్

# ఈ నెల 12 నా తంపులుర్ గ్రామంలో పర్యటన



**మెదక్ జిల్లా శుభ తెలంగాణ :**పల్లె పల్లెకు త్రిషమ్మ కార్యక్రమంలో భాగంగా మన ప్రియతమ నేత ఆందోల్ ముద్దబిడ్డ మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ గారి కూతురు త్రిష దామోదర్ తేదీ 12-7-2023 నాడు బుధవారం రోజున టేక్మాల్ మండలం లో ని తంప్లూర్ గ్రామంలో పర్యటించనున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు , సర్పంచులు , ఎంపీటీసీలు, %ూూజూ% పిఎసిఎస్ డైరెక్టర్లు వివిధ గ్రామాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ ఎస్టీ మరియు మైనార్టీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు , యన్ యస్ యు ఐ నాయకులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని టేక్మాల్ ఎంపీటీసీ నిమ్మ వాణి రమేష్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్ కోరారు

# ఆదర్శ యువజన సంఘం నూతన కమిటీ

**శుభ తెలంగాణ :**మెదక్ జిల్లా మండల పరిధిలో ఆదర్శ యువజన సంఘం నూతన కమిటీని ముఖ్య సలహాదారులు మరియు యువత కలసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఎర్రోళ్ల శేషు, ప్రధాన కార్యదర్శి గుంటి శ్రావణ్. ఈ కార్యక్రమంలో చింత భూమయ్య, రామని సంజీవులు, బొబ్బిడి రాములు, బొబ్బిడి సుధాకర్, రామని అడివయ్యా మరియు ఆదర్శ యువజన సంఘం యువత పాల్గొన్నారు



**శుభ తెలంగాణ :** చిలకలూరిపేట పట్టణం విజయ బ్యాంక్ సెంటర్ లో పై ఫోటోలోని వ్యక్తి పడిపోయి ఉండగా, ఇతడిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతడికి పిడ్స్ సమస్య ఉన్నది. ప్రస్తుతం ఇతని పరిస్థితి అంతగా బాగోలేని కారణంగా ఇతడిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇతని ఆచూకీ, వివరాలు తెలిసిన వారు చిలకలూరిపేట పట్టణ పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వగలరని చిలకలూరిపేట పట్టణ పోలీస్ శాఖ వారు తెలిపారు.

# ప్రజల వినతులను తక్షణమే పరిష్కరించాలి



● సోమవారం కలెక్టరెట్ సమావేశంలో అధికారులకు సూచించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ అభిలాష అభినవ్

● దరఖాస్తును స్వీకరించిన ఇంచార్జి కలెక్టర్ అభిలాష అభినవ్

**శుభ తెలంగాణ :** ప్రజల వినతులను పరిష్కరించాలి. ఇంచార్జి కలెక్టర్ అభిలాష అభినవ్,ప్రజల వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో... అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుండి అదనపు జిల్లా కలెక్టర్ రెవెన్యు ఎం.డేవిడ్ తో కలిసి దరఖాస్తులుస్వీకరించారు.నెల్లికుదురు మండలంలోని కాస్యతండా కు చెందిన బానోత్ బుజ్జి, తమ యొక్క సర్వేనెంబర్ 324/2/1/%ూ% నెంబర్ లో వ్యవసాయం చేసుకుంటూ ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి, దాడి చేస్తున్నారని, మమ్ములను ఇబ్బందులకు గురిచేస్తు వ్యవసాయం చేసుకోకుండాఅడ్డుకుంటున్నారని మాకు చెందిన వనరులను నాశనం చేస్తున్నారని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమను కాపాడాలని దరఖాస్తు సమర్పించారు.ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో ( 140 ) దరఖాస్తులను వివిధ శాఖల అధికారులకు సత్వర పరిష్కారంకోసంఆదేశించారు.ఈ ప్రజావాణిలో డి.ఆర్.డి.ఓ సన్యాసయ్య, సి.పి.ఓ సుబ్బారావు, డీఈఓ రామారావు, డి.హెచ్.ఎస్.ఓ. సూర్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## 200 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు. గ్రామాలు తండాలు అభివృద్ధి చేయడమే మా లక్ష్యం.

ఎమ్మెల్యే రెడ్యానాయక్.



**శుభ తెలంగాణ :**కురివి మండలంలోని డోర్నకల్ నియోజకవర్గం లో 200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు చేస్తానని శాసనసభ్యుడు డిఎస్ రెడ్యా నాయక్ అన్నారు. సోమవారం కురవి మండలంలోని సుధనపల్లి, బంజారా తండా,లచ్చ తండా,కందికొండ,మాలోత్ తండా,జాటోత్ తండా,బొడ తండా,భూక్య తండా, కొత్తూరు (సి) గ్రామాలలో పలు అభివృద్ధి పనులను శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ఉన్నాయని,కందికొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర కు భక్తులు వెళ్లడానికి మూడు కోట్ల వ్యయంతో తారు రోడ్డు త్వరలో నిర్మిస్తామని ఆయన అన్నారు. తండాలను,గూడాలను గ్రామపంచాయతీ చేసిన ఘనత సీఎం కేసీఆర్ దే అని ఆయన అన్నారు. ప్రతి గ్రామాలలో మూడు లక్షల అయంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నెల రోజుల్లో ఇస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే రెడ్యా నాయక్. గ్రామ గ్రామాలను అభివృద్ధి చేస్తున్న ఘనత బిఆర్ఎస్ పార్టీ దే అని కాబట్టి గ్రామాలలో ఓటు అడిగే హక్కు మాకే ఉందని ఆయన అన్నారు. మరోసారి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని, రాజకీయాల్లో వచ్చింది సంపాదన కోసం కాదు ప్రజల సేవ చేయడానికి అని అన్నారు. నేను చేసే ప్రజాసేవాళ్లను గుర్తించి నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతి రవి నాయక్, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, జిల్లా నాయకులు బజ్జురి పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ దొంగలి నరసయ్య, సొసైటీ చైర్మన్లు, కొండపల్లి శ్రీదేవి,గార్లపాటి వెంకటరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ ముండ్ల రమేష్, బిఆర్ఎస్ యువ నాయకులు గూగులోత్ రవి నాయక్, మాజీ ఎంపీపీ రామచంద్రయ్య, వివిధ గ్రామాల సర్పంచులు వడ్డూరి పద్మ, యానాల గంగాధర్ రెడ్డి, ఎంపీటీసీ బోజ్యా నాయక్,ఎంపీటీసీలు,గ్రామాల అధ్యక్షులు సురేష్, మాలోత్ ధన్సింగ్, బిఆర్ఎస్ నాయకులు వడ్డూరి మహేష్, మల్సూర్, భరద్వాజ్ రెడ్డి,టీచర్ సైదులు, రాము, మండల ప్రజా ప్రతినిధులు అధికారులు, అనుబంధ సంఘాల నాయకులు,పార్టీ కార్యకర్తలు నాయకులు భూక్యా సరియ్య, పేర్ల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు బానోతు రమేష్, బానోత్ గణేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ 10వ తరగతి మరియు ఇంటర్లో ప్రవేశాలు ప్రారంభం

ప్రధానోపాధ్యాయులు సిహెచ్ జీవన్ కుమార్



**శుభ తెలంగాణ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో.. నిర్వహించే ఓపెన్ 10వ తరగతి మరియు ఇంటర్లో ప్రవేశాలు ఈరోజు నుండి ఆగస్టు పదో తారీకు వరకు ప్రవేశాలు పొందవచ్చునని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సిహెచ్ జీవన్ కుమార్, తెలిపారు.ఏదైనా కారణం చేత పాఠశాల మధ్యలో మానేసిన వారు,రెగ్యులర్గాచదువుకోవడానికి వీలు కాని వారు, ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకునే విద్యార్థులు ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని తెలిపారు. మిగతా వివరాల కోసం స్టడీ సెంటర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 919908234819, 9701575227సంప్రదించగలరు.సిహెచ్ జీవన్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెల్లికుదురు.

## నూతన రేషన్ డీలర్ గా నియామక పత్రాన్ని అందచేసిన తహసీల్దార్

**శుభ తెలంగాణ :**సంగారెడ్డి జిల్లా రాయికోడు మండలం పీపడపల్లి గ్రామం రేషన్ డీలర్ షబ్బీర్ పటేల్ గత సంవత్సరం అనారోగ్యంతో చనిపోవడం జరిగింది అప్పటినుండి రేషన్ డీలర్ పోస్టు కాలిగా ఉండడంతో మొన్న జరిగిన ఇంటర్వ్యూ ఎగ్జామ్లలో ఎన్నికై నూతన డీలర్ గా బాధ్యతలు స్వీకరించిన ముబీనా బేగం నూతన రేషన్ డీలర్ గా తేదీ.10/7/2023 బాధ్యతలు స్వీకరించడం జరిగింది



## మర్యాదపూర్వకంగా ప్రభుత్వ అధికారులను కలిసిన కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు

పుష్పగుచ్చం అందజేస్తున్న మండల నూతన అధ్యక్షుడు



**శుభ తెలంగాణ :**నెల్లికుదురు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, నూతనంగా ఎన్నికైన సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి, తో కలిసి స్థానిక ఎమ్మార్వో ని ఎంపీడీవో ని ఏవో ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారితోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కుమ్మరి కుంట్ల మౌనేందర్,కిసాన్ మండల అధ్యక్షులు పూర్ణచందర్, శ్రీరామగిరి గ్రామ ఉపసర్పంచ్ గంజి గోవర్ధన్, ఓబిసి మండల అధ్యక్షులు వరిపల్లి పూర్ణచందర్,సీనియర్ నాయకులు గడ్డం అరుణ్ కుమార్, తారసింగ్ బావి గ్రామ పార్టీ అధ్యక్షులు గుగులోతు యాకూబ్, అధ్యక్షులు పయ్యాల భిక్షం, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్ ఆకుల కొమురెల్లి బెల్లి నర్స య్య, మద్దెల సమ్మయ్య, నర్సింగ్ అశోక్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మార్వో ఎంపీడీవో ఏవో మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్,ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అభినందనలు తెలియజేశారు.

## నూతన గ్రామ బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షుడిగా నీయమకం



**శుభ తెలంగాణ :** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని శంషాధిపూర్ గ్రామంలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు రాయికోడ్ మండల యూత్ అధ్యక్షుడు అంజి ఆధ్వర్యంలో సోమవారం శంషాధిపూర్ గ్రామ యూత్ అధ్యక్షుడిగా రాకల్ నర్సింలు ఎన్నుకోవడం జరిగింది, యూత్ ఉపాధ్యక్షునిగా యరోల మల్లేష్, సోషల్ మీడియాఇంచార్జ్ గా యారోల ఆదాం, అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చూసి పలువురు కాంగ్రెస్ నాయకులు పులకంటి స్వామి దాస్, పులకంటి నరేష్ బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ బి ఆర్ఎస్ అధ్యక్షులు పి నారాయణ, ఉపాధ్యక్షలు ఆర్ నర్సింలు, సీనియర్ నాయకులు రాజు, గ్రామ టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారులపై కేజ్ విల్ తో ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు - బాల్కొండ ఎస్సై కే.గోపి



**శుభ తెలంగాణ :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల పరిధిలోని గ్రామాలలో ప్రధాన రహదారులపై నిర్లక్ష్యంగా కేజ్ వీల్ ట్రాక్టర్ ను ఎటువంటి పట్టీలు లేకుండా రోడ్డుపై నడపవద్దని బాల్కొండ ఎస్సై కే. గోపి తెలిపారు.సందర్భంగా ఎస్సై కే. గోపి మాట్లాడుతూ కేజ్ వీల్ ట్రాక్టర్ ను రోడ్డుపై నడపడం వల్ల రోడ్లు కొన్ని రోజులకే పాడవుతున్నయని కాబట్టి రోడ్డుపై కేజ్ వీల్ ట్రాక్టర్ ను పట్టిలు లేకుండా నడపడం చట్టరీత్యా నేరం ఎవరైనా అలా నడిపితే ఆ వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. బాల్కొండ మండల పరిధిలో ఎక్కడైనా రోడ్డుపై కేజ్ విల్ ట్రాక్టర్ డైరెక్టుగా నడిపినట్టు కనబడితే ప్రజలు బాల్కొండ ఎస్సై ఫోన్ నెంబర్ 8712659860 కు సమాచారం అందించాలని,సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై కే. గోపి తెలిపారు.


## నిరుపేద మహిళకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ..



**శుభ తెలంగాణ :**కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని అన్నారం కలాన్ గ్రామంలో నిరుపేద కుటుంబం మహిళ బోయి గంగమ్మని ఆమె కూతురు లక్ష్మి లకు ఇద్దరికి నెలకు సరిపడే 25 కేజీల బియ్యం మరియు బట్టలు చీర డ్రెస్ లను మరియు నిత్యవసర సరుకులు వారికి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు తమ వంతు సాయం అందజేయడంలో ముందుంటామని వారు అన్నారు . వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్వి కిషన్ ట్రెజరర్ సిహెచ్ కాశీరాం డీసీఎం వేణుగోపాల్ డిసిపి లక్ష్మి నారాయణ గ్రామ పెద్దలు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నారం వెంకటరామిరెడ్డి సభ్యులు రాజు సెట్ శేఖర్ సెట్ సంతోష్ డి రమేష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహంకాళి మాత ఫలహార బండి ఉత్సవం

● పాల్గొన్న టిపిసిసి కార్యదర్శి దండెం రాంరెడ్డి



**ఇబ్రహీంపట్నం, శుభ తెలంగాణ :**ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీశ్రీశ్రీ మహంకాళీ మాత బోనాల సందర్భంగా ఆదివారం రాత్రి మహంకాళి మత దేవాలయాన్ని దర్శించుకొని అమ్మవారికి టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపాలిటీ లో వివిధ యువజన సంఘాల ఆహ్వానం మేరకు వారు నిర్వహించిన ఫలహారం బండ్ల ఊరేగింపుల్లో పాల్గొన్నారు. పోతురాజుల నృత్యాలు, యువకుల కోలాహలంతో ఫలహారం బండ్ల ఊరేగింపు ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా దండెం రాంరెడ్డి మాట్లాడుతూ... కాళీమాత అమ్మవారి అనుగ్రహం నియోజకవర్గం ప్రజలపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎటువంటి రోగాల భారిన పడకుండా సంతోషంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు పడి రైతన్నల ఇంట పంట సిరులు కురిసి ఆనందంగా ఉండాలని అమ్మవారిని కొరుకునట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ సీనియర్ నాయకులు పండల రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు కప్పటి రఘు, మైనారిటీ సీనియర్ నాయకులు అలి భాయ్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండల శివకృష్ణ గౌడ్, సురకంటి రాజశేఖర్ రతదితరులు పాల్గొన్నారు.

# సోయాలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



**శుభ తెలంగాణ :**నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో సోమవారం సోయా పంటను పరిశీలించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోయాలో లద్దె పురుగు యొక్క ఉధృతి గమనించడం జరిగినది. లద్దె పురుగు ఆకులలోని పత్ర హరితాన్ని గీకి తినడం వలన ఆకుల ఈనెలు మాత్రమే మిగిలి జాలి లాగా కనబడుతుంది తద్వారా ఎదుగుదల లోపించి దిగుబడి తగ్గిపోతుంది.దీని నివారణకు విషపు ఎర:ఒక కిలో బెల్లం,10 కిలోల తవుడు, తయోడికార్డ్ 300 గ్రాములు లేదా క్లోరోపైరీఫాస్ 500 ఎం ఎల్ కలిపి పులియబెట్టి ఉండలుగా చేసి సాయంత్రం నాలుగు గంటలకు ఫీల్డ్ లో చల్లడం ద్వారా లద్దె పురుగును నివారించుకోవచ్చు లేదా ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమామెక్టిన్ బెంజ్ 100 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకొని నివారించుకోవచ్చు.

రసం పీల్చే పురుగులు : ఆకులలోనే రసాన్ని పీల్చి మొక్క వడలిపోయేటట్లు చేసి ఎదుగుదలను దెబ్బతీసి నష్టాన్ని చేకూర్చును. నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమిడా క్లోప్రేడ్ 300 ఎం ఎల్, లేదా ఎసిటమెప్రైడ్ 100 గ్రామ్స్ ఏదేని ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి.ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ గౌడ్, నామనంది సాయన్న, వీడీసీ రాజన్న, ఏఈఓ నిహారిక, వీఆర్ఏలు రాజేశ్వర్,రఘు, రైతులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com